

# టోకరాసురోపాఖ్యానము

"పూర్వము హాలీవుడ్డు అనే గ్రామంలో హరనాధ్‌బాబా అనే అసహాయ సూరుడుండేవాడు...."

"అదేమిటి మేష్టారూ — హాలీవుడ్‌లో హరనాధ్‌బాబా యెలా ఉంటాడండి ? మీ బొందలా ఉంది."

"ఎందుకుండడు. యతికోసం చచ్చినట్టు పుచ్చిన కుక్కలా ఉంటాడు. ఏదో ఇంత తెలుగు పిక్చర్‌లకి డైలాగులు రాయాలికదా. అలవాటైపోయింది. పోన్లే. హాలీవుడ్‌లో హారిసన్ అనే వాడున్నాడు."

"ఇంకా వున్నాడాండి."

"ఇప్పటి సంగతి కాదు. పదిహేనేళ్ళక్రితం ఉన్నాడుట. దరిమిలా ఉండటం మానేశాడేమో తెలీదు." అన్నాడు నరసన్న.

"వాడేం చేసేవాడంటే—" అని కొనసాగించాడు నరసన్న.

అంతలోకే స్టేషన్ వచ్చింది.

"చూడు బ్రదర్, నీపేరేమిటి?" అన్నాడు నరసన్న కథను ఆపి.

"రాజు" అన్నాడు రాజు.

"భేష్ రైలాగ్గానే వెళ్ళి మనిద్దరికీ కాస్త టిఫినూకాఫీ, ఓ పెట్టె సిగరెట్లు కొట్టుకొచ్చేయి. నేనో రూపాయిస్తాలే.... అలాచూస్తావేం. కథని మాంచి రసపట్టులో ఆపేశానని నిరుత్సాహంగా ఉందా?"

"మీరింకా మొదలెట్టలేదుగా" అనుకుంటూ, "ఔను మరే" అంటూ నవ్వాడు రాజు.

రైలాగింది. రాజు మరచెంబు పట్టుకువెళ్ళాడు కాఫీ కోసం.

బీదలకు అంబలి దానం చేస్తున్నవాడి తరహాలో అక్కడి హొటేలు వాళ్ళు చాలా ఠీవిగా చిరాగ్గా, సరుకులమ్ముతున్నారు.

తను తిని, గురూజీకి ఫలహారం కట్టించేవరకు రైలు కూతకూసింది. ఉరకలూ పరుగులుగా వచ్చి పెట్టెలోకెక్కి పోయాడు రాజు.

నరసన్న లేడు!

ఏడీ! నరసన్న! అని ఆశ్చర్యపడ్డాడు రాజు.

"అన్నా నరసన్నా లేవా ఇకలేవా" అనేపాట పాడబోయి, ఈలోగా వచ్చేస్తాడేమోనని ఓ క్షణం తటపటాయించాడు రాజు.

"మీ బాబాయిగారు అర్జెంటుగా రైలుదిగి వెళ్ళారండి ఎవరో ఫ్రెండు కనబడితేను" అన్నాడు అసింటా కూచున్న రైల్వే బైరాగి లాలనగా నవ్వుతూ.

"మా బాబాయెవడు? మధ్య నువ్వెవడు?" అంటూనే అప్రయత్నంగా వంగి బల్లకిందకి తొంగిచూశాడు రాజు.

పెట్టె గల్లంతు!

"హారినీ!" అన్నాడు రాజు హడావుడిగా.

"ఆయన మీ బాబాయి కాదా? నే అనుకున్నాలెండి. ఆ హడావుడి చూసి. పాపం మీ పెట్టి తీసుకుపోయి అయింది వదిలేశాడు కాబోలు. ఆ పక్కకి చూడండి." అన్నాడు బైరాగి.

దానికి తాళం గీళం లేవు. రాజు ఆ పెట్టె తెరిచాడు.

సుమారు రెండువీశల న్యూస్ పేపర్లూ, రెండు మూడు ఖాళీసీసాలు అందులో ఉన్నాయి.

రాజుకి నోట మాట రాలేదు. 'కథన్నా పూర్తిగా చెప్తివి గాదు వరసన్నా' అన్నాడు మెల్లిగా.

'ఆయన చెబుతున్న కథ ఏమిటండీ?' అన్నాడు రైల్వేబైరాగి.

"టోకరాసురోపాఖ్యానంట" అంది రాజు నోరు; నీకెందుకు అన్నాయి అతని నొసలు.

"అదే ఇది" అన్నాడు బైరాగి బీడీ ముట్టిస్తూ.

"వీడి దుంపతెగ! వీడి కెప్పుడూ ఒక్కలాటి వేషాలే దొరకా.... టోకరా కథలు చెబుతూ చెబుతూ నాకే టోపీవేసి మస్కాకొట్టాడే.... .... ఆ పెట్టినిండా ఫిలింస్టోరీలూ, డైలాగులూ, స్టిల్సూ, సినిమాటోగ్రఫీ —

అన్నిటికన్న ముఖ్యం త్రీథౌజండ్ సాంగ్సు ఉన్నాయిగదా. ఇప్పుడెలా?" అన్నాడు రాజు మెల్లిగా.

"అవన్నీ మీరు రాసినవే? ఓరి బాబో" అన్నాడు రైల్వేబైరాగి అద్భుతరసాన్ని నటించి.

"ఔనండి .... నేను చాలా బ్రిలియంట్ ఫెలోని లెండి .... అన్నీ నేనే రాశాను .... మావద్ద అన్నిరకముల సాంగ్సు దొరుకును....ఏడిచేవి, నవ్వేవి, జోలపాటలూ, నేపథ్యప్పాటలూ అన్నీ హోల్ మొత్తం త్రీథౌజండ్ ఉన్నాయండి. ఈ దొంగపీనుగ వాటితో గబుక్కున, నాకన్న ముందర గొప్పవాడై ఊరుకుంటాడు .... ఇంత పచ్చిదొంగ అనుకోలేదు రైల్వేబైరాగిగారూ .... వీణ్ణేమనాలో తెలీటం లేదు స్వామీ" అన్నాడు వరహాలరాజు హృదయ విదారకంగారుగా.

రైల్వేబైరాగి ఒక్కక్షణం ఆలోచించాడు. తనకు తోచిన మాటలు సూచించటానికి.

"పుస్తకాల్లో రాసుకునే మాటలే చాలనేపక్షంలో, దొంగ పీనుగ, కంత్రీవెధవ, పచ్చికేడీ, దండువెధవ, ఇంగ్లీషులో రాస్కెల్, ఇంకా దుర్మార్గుడు, క్రూరుడు, మరీ ఘాటుగా తిట్టాలంటే అప్పులవాడూ, టిక్కెట్టు కలెక్టరు, అనవచ్చును." అన్నాడు రైల్వేబైరాగి గుక్క తిప్పుకోకుండా.

గుక్క తిప్పుకోడానికి తెరిపి చేసుకోగానే.

"అయ్యా ఒక్క చిన్న మంగుళూరు బీడీ — అణాకాత్రకం ఇవ్వండి" అన్నాడు.

రాజుకి బైరాగి సలహాలు నచ్చలేదు.

"థాంక్యూ, మీ డైలాగు బాగానే ఉంది గాని ఘాటుగా లేదు. మాటమాటకీ నూటొక్క అర్థాలుండాలి. సినిమా డైలాగులు మీరు వినలేదు

కావును. ముఖ్యంగా ఆస్సెపు డై లాగులకి, ఉండేవి రెండర్థాలే అయినా ఎంత బ్రహ్మాండంగా ఉంటాయని!" అన్నాడు రాజు.

"నీకు నాలుగు చేతులున్నాయిస్మీ" అంటూ భక్తుడు చెబుతుంటే, వింటూ నిల్చున్న విష్ణుమూర్తిలా నవ్వాడు రైల్వేబైరాగి.

"ఎందుకు నాయనా! మానిన గాయాలని మరచిన ఆశయాలని రేపుతావు" అన్నాడు మందహాసం చేస్తూ. అది కాస్తా అతగాడి గడంలో చిక్కడిపోయినందువల్ల రాజుకి కనపడలేదు. కాని ఇతగాడూ ఇంకో కథ చెప్పి ఇంకేమన్నా ఎత్తుకుపోతాడేమోనని భయం వేసింది. అందుకని మాట్లాడకుండా, బైరాగులతో నాకేమిటన్న పోజును అభినయించి, తల అటువేపు తిప్పాడు.

"హుం, అన్నీ పోతే పోయాయిగాని ఎడ్రసులు పోతే ఎలాగ?...." అని గొణుక్కున్నాడు ఉండబట్టలేక.

''ఎవరెడ్రసులు బాబూ – బీడీ ఇచ్చావు గాదు'' అన్నాడు బైరాగి కాస్త దగ్గిరగా జరిగి ముందుకు ఒరిగి.

రాజుకి దుఃఖం, తిక్కకోపం, జమిలిగా ముంచుకొచ్చాయి.

"ఎవరెడ్రసు లేమిటయ్యా, సినిమాస్టార్ల ఎడ్రసులు. ఒకటా రెండా? వందా? యాభయా? వందా యాభయి .... చచ్చిచెడి సంపాదించాను."

''దానికేముంది నాయనా. ఏ సినిమా పత్రికొక్కన్నా కొల్లలుగా దొరుకుతాయి. ఈపాటిదానికే ఏటికీ బెంగ? ఒక్క బీడీ ఇచ్చావు గాదు" అన్నాడు.

రాజు ఉలిక్కిపడ్డాడు. ''మీరు సాంగు రైటరాండి కొంపతీసి?'' అన్నాడు.

బైరాగి బాధగా నవ్వాడు. ''వద్దన్నానా నాన్నా? నామానివ ఆశయాలూ, నే మరచిన గాయాలూ .... మళ్ళీ''

"సార్ .... తప్పు చెబుతున్నారండి మానినగాయాలూ మరచిన ఆశయాలూ అనాలి .... ఇంకోటి. నన్నడిగితే ఆశయాల్లో శకారం తీసిపారేస్తే బెస్టు. గాయాలూ, అయాలూ అని స్మూతుగా ఉంటుంది'' అన్నాడు రాజు.

బైరాగి 'బాధను అణచుకొనుట' అభినయించి 'విషయమును మార్చ ప్రయత్నించుట' ను నటించి ''ఆ ఎడ్రసులు దొరకవన్నారు చూడండి .... ఎక్కడన్నా దొరుకుతాయిగా .... నా బీడీ డైలాగు మీరు వింటం లేదు" అన్నాడు.

''లేదులెండి సార్ .... మీరు చెప్పే పుస్తకాల్లో సినిమావాళ్ళ పేరు ఉంటుంది కాని ఎడ్రసులు సరిగ్గా ఉండవు. అంతెందుకు నాకు తెలిసిన ఒక అసిస్టెంటు డైరెక్టరు పేరేసి, అడ్రస్ కేరాఫ్ కొడంబాకం హైరోడ్డు అని రాసి ఊరుకున్నారు...."

"అంతేలెండి మీకు తెలిసిన ఆ అసిస్టెంటు ఆ రూటులోనే తిరుగుతూ ఉంటాడు. పెర్మనెంట్ అడ్రసు అన్నమాట'' అన్నాడు బైరాగి ముక్కుపుటాలు ఎగరేస్తూ.

''హో .... అలాగండి. నాకు తెలీదులెండి. నేను ఒక్కో పత్రికకి ఒక్కొక్క స్టారు అడ్రసు అడుగుతూ రాసి జవాబు తెప్పించి అవన్నీ పోగేశాను లెండి. ఎలాగైనా ఎడ్రస్ లేకుండా మెడ్రాసు వెళ్ళడం ఎందుకని—''

బైరాగి మాట్లాడలేదు. నిముషం రైలు టాపువైపు చూస్తూ ఇంకా ఆలోచించాడు. ఆనక రాజు మొహం 'లెవెల్' కి దింపి "ఎవరెడ్రసులు కావాలి మీకు?'' అన్నాడు గంభీరంగా.

రాజు బాధగా నవ్వాడు.

"మీరేం ఆర్చేవారా, తీర్చేవారా స్వామీ ?" అన్నాడు.

"వాళ్ళిద్దరూ ఎవరో నాకు తెలీదుగాని మీరు నా మానినగాయాలూ, మరచిన అ(శ)యాలు రేపారు. ఇంకెందుకు? చెబుతున్నా నేనొహ కారక్టర్ యాక్టర్ని లెండి'' అన్నాడు బైరాగి బాధగా తలవంచుకుని.

"ఛా! .... నాకు తెలీదుసుమండీ. కల్లోకూడా అనుకోలేదు. అయితే మీరూ మెడ్రాసే నన్నమాట .... సినిమాల్లోనే చేరుతారా ?"

"కాపోతే పెరంబూరు కోచి ఫ్యాక్టరీలో చేరతానండీ ? మీరు మరీ ఇదిగాని .... .... బీడీ ఇచ్చారుగాదు."

"అయితే మీకు అందరి ఎడ్రసులూ తెలుసునన్నమాట——"

బి. ఎ. ప్యాసైనవాణ్ణి ఎ. బి. సి. డీలు వచ్చునా అంటూ చిన్న పిల్లాడు అడిగే ప్రశ్నకి, జవాబులా నవ్వాడు బైరాగి: ఎ. నాగేశ్వరరావు 38 సారంగపాణి స్ట్రీటు, టీనగర్, ఎన్.టి. రామారావు, 63 బజుల్లారోడ్డు టీనగర్ .... అంటూ ఏబీసీడీల వంతుగా ఏకబిగిన ఏకరువు పెట్టాడు.

రాజుకి అతనిమీద ఎనలేని భక్తి తాత్పర్యాలు కలిగాయి.

"నివురుగప్పిన నిప్పులా''—అన్నాడు ఆనందగాద్గదిక స్వరంతో.

"వెదకబోయిన తీగలా — బీ డీ లే దా ?'' అన్నాడు బైరాగి ఉత్సాహంగా.

"సార్ తీగలదైలాగులు వద్దండి. ఇందాక నాపెట్టి ఎత్తుకుపోయిన వాడితో మాటాడుతూ ఇదే అన్నాను. ఇప్పటికి రెండు తీగలు తగిలాయి వెతక్కుండానే. వాటిలో చిక్కడి బోల్తాకొట్టాను.''

"అలా భయపడితే ఎలా? సినిమాలో చేరి పైకిరావాలంటే ఎంత ధైర్యం ఉండాలి, ఎంత శక్తి ఉండాలి."

"అదేం ఫరవాలేదు సార్. ఒక్కొక్కసారి భయపడ్డ వాళ్ళకీ, ఎవరూ తెలీని చిన్నవాళ్ళకీ ఛాన్సులు వస్తాయిలెండి. దేవికారాణి కంటబడేదాకా దిలీప్‌కుమార్ పళ్ళదుకాణం నడిపేవాడట. ఆవిడ అతను మంచి నటుడవుతాడని పసిగట్టి, సిఫార్సుచేసి సినిమాఛాన్సు ఇప్పించిందట. అలాగే, లైట్‌బాయ్‌గా ప్రవేశించి తారాపథాన బ్రహ్మాండమైన కీర్తిప్రతిష్ఠ లార్జించి పెద్దయాక్టర్ ప్రొడ్యూసర్ డైరెక్టరయిన రాజ్‌కపూర్—"

"హుఁ .... ఈ కథలు అందరికీ తెలుసు. వాళ్ళకి తెలివితేటలూ అదృష్టమూ కూడా కలిసొచ్చాయి. వుత్త తెలివితేటలతో ఛాన్సులు సంపాదించిన సూరదాస్ కథ చెబుతావిను" అన్నాడు బైరాగి.